క్లుప్తంగా

కొలతల మేర ఉపాధి పనులు చేసుకోవాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీఓ మోదీన్‌బాషా

కోడుమూరు రూరల్ : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనులను కూలీలు కొలతల ప్రకారం చేసుకోవాలని ఏపీఓ మోదీన్‌బాషా సూచించారు. మంగళవారం కోడుమూరులో జరుగుతున్న ఉపాధి పనులను ఏపీఓ తనిఖీ చేశారు. కూలీల హాజరు, మస్టర్లు, పనుల వివరాలను పరిశీలించారు. ఏపీఓ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్ణయించిన కొలతల ప్రకారం పనులు చేస్తే రోజువారి వేతనం రూ.300 వరకు వస్తుందన్నారు. కూలీలు ముందుకొస్తే ఉపాధి పథకం కింద పనులు కల్పించడం జరుగుతుందని ఏపీఓ తెలిపారు. ఉపాధి కింది పండ్లతోటలు సాగు చేసుకునే అవకాశం ఉందని, చిన్న, సన్నకారు రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు

ముగిసిన బండలాగుడు పోటీలు

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లులో మొహర్రం సందర్భంగా నిర్వహించిన బండలాగుడు పోటీలు మంగళవారం ముగిసాయి. పోటీలలో గెలుపొందిన వృషభ రాజుల యజమానులకు నగదు బహుమతులను నిర్వాహకులు అందజేశారు. కోడుమూరు మండలం వెంకటగిరి గ్రామానికి చెందిన ప్రసాద్ స్వామి వృషభాలు మొదటి బహుమతి రూ.40వేలు కైవసం చేసుకున్నాయి. రెండవ బహుమతిని రూ.30వేలను పులివెందులకు చెందిన విశాంక్ వర్ధన్‌రెడ్డి వృషభాలు దక్కించుకున్నాయి. డోన్‌కు చెందని డాక్టర్ గుర్నాథ్ వృషభాలు మూడవ బహుమతి రూ.20వేలు కైవసం చేసుకున్నాయి. నాలుగవ బహుమతి రూ.10వేలు పీర్ పల్లెకు చెందిన రంగనాయకులు వృషభాలు, ఐదవ బహుమతి రూ.5వేలు ఆలమూరుకు చెందిన పత్తి ప్రసాద్ వృషభాలు, ఆరవ బహుమతి రూ.4వేలు కలుగొట్లకు చెందిన రమేష్‌నాయుడు వృషభాలు గెలుచుకున్నాయి.

కోలుకోలేక యువకుడు మృతి



మృతి చెందిన మల్లికార్జున

ఓర్వకల్లు: అనారోగ్యంతో ఆత్మహత్యకు పాల్పడిన యువకుడు చికిత్స పొందుతూ కోలుకోలేక మంగళవారం మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు నన్నూరు గ్రామానికి చెందిన కార్ణటకం మల్లికార్జున (26) కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడేవాడు. నొప్పి భరించలేక ఈ నెల 13న సాయంత్రం ఇంట్లో పురుగుల మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతుని సోదరుడు రాజశేఖర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రాజారెడ్డి తెలిపారు. అయితే మృతునికి ఇంతవరకు వివాహం జరుగలేదని తెలిసింది.

పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించండి

కల్లూరు : పారిశుద్ధ్యంపై గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. మండల పరిధిలోని చిన్నటేకూరు, బస్తిపాడు, బొల్లవరం, పుసులూరు గ్రామాల్లో మంగళవారం ఎంపీడీఓ పర్యటించారు. గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులు పరిశీలించారు. అనంతరం ఆయా గ్రామ సచివాలయాలను తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ సచివాలయ ఉద్యోగులు ప్రజలకు అందుబాటులో ఉండాలని, మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ప్రజా సమస్యలపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ వార్దు రవికిషోర్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పీహెచ్‌సీలో డ్రైనేజీ పనులు

గూడూరు రూరల్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల వసతి గృహానికి సంబంధించిన బాత్ రూంలు, టాయిలెట్ల మురుగునీరు పరిసరాల్లో నిల్వ అవుతున్నాయి. దీంతో మంగళవారం నగర పంచాయతీ అధికారులు సిబ్బందితో డ్రైనేజీ పనులు చేయించారు. ఇంజినీరింగ్ సెక్షన్ ఏఈ నరసింహులు పర్యవేక్షణలో సిబ్బంది హాస్టల్ నుంచి పక్కనే ఉన్న పీహెచ్‌సీ డ్రైనేజీకి కలుపుతూ బయటకు నీరు వెళ్లేలా జేసీబీ యంత్రంతో మట్టి కాలువను తీయించారు.

పాణ్యం డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శివారెడ్డి



పాణ్యం: పాణ్యం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా మంగళవారం శివారెడ్డి బాధ్యతలు స్వీకరించారు. అంతకుముందు ఉన్న ప్రిన్సిపాల్ సింహాద్రిపై అనేక ఫిర్యాదులు రావడంతో ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. దీంతో ఆదోని పని చేస్తున్నా శివారెడ్డిని ఉన్నతాధికారులు ఇక్కడికి బదిలీ చేశారు. కళాశాల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ప్రిన్సిపాల్ చెప్పారు.



వేంకటేశ్వరస్వామి చేతిలో శంకును తలపిస్తున్న దృశ్యం



రెండు కొండల మధ్య నిర్మించిన ఇనుప వంతెన



పల్లకీ ఆకృతిలో దర్శనమిస్తున్న దృశ్యం



ఉగ్రనరసింహుని అవతారం

ప్రకృతి చెక్కిన అందాలు!

- పర్యాటకులను ఆకట్టుకుంటున్న రాక్‌గార్డెన్
- ప్రశాంత వాతావరణంలో అబ్బురపరుస్తున్న కొండ ఆకృతులు
- ప్రకృతి సృష్టి శిలారూపాలు అంటూ పర్యాటకుల కితాబు

ఓర్వకల్లు: మండల కేంద్రం ఓర్వకల్లు సమీపాన జాతీయ రహదారి పక్కనే ఉన్న రాక్‌గార్డెన్ (రాతి వనం) పకృతి ప్రేమికులు, పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఎర్రమల కొండల్లోని రాక్‌గార్డెన్ ప్రకృతి ప్రేమికులకు నిలయంగా మారింది. దాదాపు 30 ఏళ్ల కిందట పర్యాటక శాఖ ఆధ్వర్యంలో సహజ సిద్ధంగా నిర్మించిన హరితా రెస్టారెంట్ పర్యాటకులకు ఆహ్లాదాన్నిస్తుంది. 200 ఎకరాల్లో విస్తరించిన రాక్‌గార్డెన్‌లో పర్యాటకుల సౌకర్యార్థం 20 ఏ/సీ గదులు సైతం అందుబాటులో ఉన్నాయి. అదేవిధంగా గార్డెన్ పైభాగంలో తిరుపతి పురావస్తు కళాశాల విద్యార్థులు నిరుపయోగమైన ఇనుపవస్తువుతో వివిధ జంతువులు, పక్షుల ఆకృతులలో రూపొందించిన కళారూపాలు సందర్శకులను మురిపిస్తున్నాయి. కుటుంబ సమేతంగా వచ్చిన పర్యాటకుల సౌకర్యార్థం పిల్లలు ఆడుకునేందుకు తొక్కుడు బల్ల, ఊయల, జారుడు బండ తదితర ఆటవస్తువులు అందుబాటులో ఉన్నాయి. అయితే రాక్‌గార్డెన్ పైభాగంలోని కొండలు అద్భుత ఆకారంలో దర్శనమిస్తున్న దృశ్యాలు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ప్రకృతి చెందిన అందాలుగా అబ్బురపరుస్తున్నాయి. ప్రకృతి ప్రేమికులను కొండరాళ్ల అందాలు కనువిందు చేస్తున్నాయి. ఒక్కో కొండ ఓ విధమైన ఆకారంలో పర్యాటకులను ఆకట్టుకుంటుంది. ఉగ్రనరసింహుని అవతారంలో ఓ కొండ, వేంకటేశ్వరస్వామి చేతిలో శంకును తలపిస్తున్న మరోకొండ, పల్లకీ ఆకృతిలో దర్శనమిస్తున్న ఇంకో కొండ తదితర దృశ్యాలను ప్రకృతి చెక్కిన అందాలంటూ కితాబు ఇస్తున్నారు పర్యాటకులు. ప్రధానంగా రెండు కొండల మధ్య నిర్మించిన వంతెన ఆకట్టుకుంటుంది. ఇక్కడ ప్రశాంత వాతావరణాన్ని ఆస్వాదిస్తూ పర్యాటకులు సెల్ఫీలు తీసుకుంటూ మురుసిపోతున్నారు.



రాక్ గార్డెన్ ముఖద్వారం

'బాహుబలి' షూటింగ్ ఇక్కడే....

సినీ రంగంలో చరిత్ర సృష్టించిన బాహుబలి చిత్రం ముఖ్య సన్నివేశాలు ఇక్కడే జరిగిందనే విషయం ఈ ప్రాంత ప్రజలకు తప్పా చాలా మందికి తెలియదు. చాలా సినిమాలు ఇక్కడ చిత్రీకించారు. గతంలోనూ ఇంద్ర, ఆది, జయం మనదేరా, సుభాష్ చంద్ర బోస్, టక్కరి దొంగ తదితర చిత్రాలు ఇక్కడే షూటింగ్ చేశారు. కొండలకు సంబధించిన సన్నివేశాలంటే దర్శక నిర్మాతలకు గుర్తొచ్చేది రాక్ గార్డెనే అంటుంటారు సినీ ఆర్టిస్టులు.

సమన్వయంతో పని చేయాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి

పాణ్యం: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సూచించారు. మంగళవారం పాణ్యంలో ఎంపీపీ హుశేన్‌బీ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి గ్రామంలో అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వర్షకాలం ప్రారంభమైనందున సీజనల్ వ్యాధులుసోకే ప్రమాదం ఉందని, ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఆర్‌అండ్‌బీ శాఖ పరిధిలో జరిగిన అక్రమణలపై చర్యలు తీసుకోవాలని, ఆక్రమణదారులకు తక్షణమే నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ప్రధాన కూడళ్లో ఇష్టానుసారంగా దుకాణాలు, హోటల్స్, ఏర్పాటు చేసుకుని అద్దెలు వసూలు చేసుకుంటున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు.

- ట్రాన్స్‌కో ఏఈ అందుబాటులో ఉండడం లేదని కౌలురు ఎంపీటీసీ సభ్యులు భాస్కరరెడ్డి సభ దృష్టికి తీసుకొచ్చారు. కరెంట్ కోతలు అధికంగా ఉన్నాయని, అసలు ఎందుక తీస్తున్నారో తెలియడంలేదని అసహనం వ్యక్తం చేశారు.
- సర్పంచ్‌లకు తెలియకుండా అధికార పార్టీ నాయకుతో స్టూడెంట్ కిట్స్ పంపిణీ చేయిస్తారని మద్దూరు, తొగర్చేడు, భూపనపాడు గ్రామాల సర్పంచ్‌లు ప్రదీప్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, జనార్ధన్ ఎంఈఓ కోటయ్యను ప్రశ్నించారు. ఇకపై అలా జరగకుండా చర్యలు తీసుకుంటామని ఎంఈఓ తెలిపారు.
- పాణ్యం చెరువు కింద దాదాపుగా 200ఎకరాల వరకు నీటమునిగాయని ఉపాధి పథకం ద్వారా తొలగించాలని పాణ్యం ఎంపీటీసీ రంగరమేష్ కోరారు. ప్రతిఏటా సాగుభూమి పనికి రాకుండా పోతుందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జట్పీటీసీ సద్దల సరళమ్మ, ఎంపీడీఓ భాగ్యలక్ష్మీ , తహల్దార్ ఫణికుమార్, వైస్ ఎంపీపీలు వెంకటేశ్వర్లు, పార్వతమ్మ, మండల స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

దోషులను కఠినంగా శిక్షించాలి



మైనర్ బాలిక మృతికి సంతాపం తెలియజేస్తున్న వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు

కోడుమూరు రూరల్: నంద్యాల జిల్లా ముచ్చుమర్రి గ్రామంలో అభంశుభం తెలియని ఏడేళ్ల చిన్నారి అత్యాచారం, హత్యపై ప్రభుత్వం త్వరగా విచారణ పూర్తి చేసి దోషులను కఠినంగా శిక్షించాలని వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం రాత్రి కోడుమూరులోని కోట్ల సర్కిల్‌లో వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నాయకులు చిన్నారి చిత్రపటాలతో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్నారి జరిగిన అత్యాచారం, హత్యను చూస్తే మానవజాతి తలదించుకోవాల్సిన పరిస్థితి అన్నారు. నేటికీ పోలీస్ అధికారులు, ప్రభుత్వం ఇంత వరకు ఆ చిన్నారి మృతదేహాన్ని కనిపెట్టలేకపోవడం దారుణమన్నారు. నంద్యాల జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా, ఎంపీ సొంత నియోజకవర్గంలో ఇంత దారుణం జరిగినా కూటమి ప్రభుత్వానికి చీమకుట్టినట్లుగా కూడా లేదని విమర్శించారు. బాధిత కుటుంబానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.50లక్షల ఎక్స్‌గ్రేసియా ప్రకటించడంతో పాటు, కుటుంబంలోని ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించాలని డిమాండ్ చేశారు. త్వరగా కేసులోని నిజనిజాలను కనిపెట్టి దోషులకు శిక్ష పడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ, సీపీఎం, ఆవాజ్ కమిటీ, ఎమ్మార్పీఎస్, సీఐటీయూ, హమాలీ, ఆటో యూనియన్ నాయకులు గఫూర్ మియ్యా, రాజు, అంధ్రయ్య, వీరన్న, ముస్తఫా, ఖాజా మల్లయ్య, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడు ఆత్మహత్య

కోడుమూరు రూరల్: తండ్రి క్యాన్సర్‌తో చనిపోవడాన్ని జీర్ణించుకోలేక 21ఏళ్ల కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన సోమవారం సాయంత్రం మండలంలోని కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తూరుకు చెందిన బాలరాజు పదినెలల క్రితం క్యాన్సన్‌తో కోలుకోలేక మృతి చెందాడు. తండ్రి మరణించినప్పటి పెద్ద కుమారుడు కిరణ్‌కుమార్ (21) తీవ్ర మనోవేదనకు గురవుతుండేవాడే. ఈ నేపథ్యంలో తండ్రిలేని లోకంలో తాను జీవించలేననుకున్నాడో ఏమో...సోమవారం సాయంత్రం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. విషయం తెలుసుకున్న కోడుమూరు పోలీసులు గ్రామాన్ని చేరుకుని కిరణకుమార్ మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కోడుమూరు పీహెచ్‌సీకి తరలించారు. తల్లి మహేశ్వరి ఫిర్యాదు మేరకు మంగళవారం కోడుమూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఇంటి పెద్దదిక్కైన భర్త క్యాన్సర్‌తో మృతిచెందడం, ఏడాదిలోపే చేతికొచ్చిన పెద్ద కుమారుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడడంతో మహేశ్వరీ తీవ్రంగా రోధిస్తోంది.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ శకుంతల

సి.బెళగల్: సీజనల్ వ్యాధులపై ఉద్యోగులు, వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీఓ శకుంతల ఆదేశించారు. మంగళవారం స్థానిక గ్రామ సచివాలయం - 2లో సి.బెళగల్ పీహెచ్‌సీ డాక్టర్ మిథున్‌రెడ్డి, ఈఓఆర్డీ సందీప్‌లతో కలిసి ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. గ్రామాల్లో ప్రజలు పరిశుభ్రమైన నీరు తాగేలా అవగాహన కల్పించాలని, కోర్డినేషన్ చేసిన శుభ్రమైన మంచినీటిని సరఫరా చేయాలని సూచించారు. మురుగునీరు నిల్వలేకుండా పంచాయతీ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలని ఈఓఆర్డీ సూచించారు. డాక్టర్ మాట్లాడుతూ కాచి చల్లార్చిన నీటిని తాగాలని, అదే విధంగా ఆహార పదార్థాలపై ఈగలు వాలకుండ ప్రజలు జాగ్రత్త తీసుకోవాలన్నారు. డయేరియా, డెంగీ, మలేరియా వ్యాధుల వ్యాప్తి తీరును డాక్టర్ వివరించారు. సమావేశంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్లు మల్లేశ్వరి, పద్మావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో పెద్ద సరిగెత్తు



వెంకటగిరి: పీర్లస్వాములను ఊరేగిస్తున్న దృశ్యం



పీర్లస్వాములను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే గౌరు చరిత



లొద్దిపల్లె అలీ అక్బర్ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

కోడుమూరు రూరల్ : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం వేడుకల్లో భాగంగా మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తు వేడుకలను భక్తులు ఘనంగా నిర్వహించారు. ఆయా పీర్లచావిళ్లలో కొలువుదీరిన పీర్లస్వాములకు భక్తులు చెక్కర చదివింపులు చేశారు. మరికొందరు పూలదట్టీలు, వెండి గొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అగ్నిగుండాల చుట్టూ యువకులు సాహోసేన్ ఆడారు. పీర్లదేవుళ్లు బుధవారం సాయంత్రం ఏటికి వెళ్లడంతో మొహర్రం వేడుకలు ముగుస్తాయని కోడుమూరు కోటవీధి పీర్లచావిడి నిర్వాహకులు నాయబ్ ఖాజామోద్దీన్ తెలిపారు.

సి.బెళగల్: మొహర్రం వేడుకలు మండల కేంద్రం సి.బెళగల్‌తోపాటు గ్రామాల్లో భక్తిశ్రద్ధ మధ్య సాగుతున్నాయి. మంగళవారం రాత్రి ప్రారంభమైన పెద్ద సరిగెత్తు వేడుకలు బుధవారం తెల్లవారుజాము వరకు సాగాయి. పీర్లదేవుళ్ల ఊరేగింపు భక్తిశ్రద్ధల మధ్య సాగింది. భక్తులు పీర్లదేవుళ్లకు చెక్కర చదివింపులుచేసి మొక్కులు చెల్లించుకున్నారు.

ఓర్వకల్లు: మండలంలోని పలు గ్రామాలలో మధ్య సరిగెత్తు వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొహర్రం సందర్భంగా కొలుదీరిన పీర్లస్వాములకు ప్రత్యేక ఫాతేహాలు సమర్పించారు. మధ్య సరిగెత్తులో భాగంగా ఆయా గ్రామాల్లో కొలువుదీరిన పీర్లస్వాములను సోమవారం అర్ధరాత్రి నుంచి ఊరిగేంచారు. పీర్ల దేవుళ్లకు భక్తులు చెక్కర చదివించి మొక్కులు తీర్చుకున్నారు. మరికొందరు భక్తులు పూల దట్టీలు, వెండగొడుగులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

పీర్ల స్వాములను దర్శించుకున్న ఎమ్మెల్యే

పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి మంగళవారం పీర్ల స్వాములను దర్శించుకున్నారు. చెన్నంశెట్టిపల్లె, హుసేనాపురం, ఉప్పలపాడు గ్రామాలలో నిర్వహిస్తున్న మొహర్రం వేడుకల్లో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో కొలువైన పీర్ల స్వాములను దర్శించుకొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో నంద్యాల టీడీపీ జిల్లా అధ్యక్షుడు మల్లెల రాజశేఖర్, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, నాయుకులు నన్నూరు విశ్వేశ్వర రెడ్డి, చంద్రపెద్దస్వామి తదితరులు పాల్గొన్నారు.

పాణ్యం: మండల పరిధిలోని గోరుకల్లులో కొలువైన పెద్దస్వామిని మంగళవారం ఎమ్మెల్యే గౌరుచరితారెడ్డి దర్శించుకున్నారు. స్వామివారికి ఫాతెహాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. మొహర్రం సందర్భంగా ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు.



సి.బెళగల్: పెద్ద దేవుడి చావిడిలో కొలువైన పెద్ద ఖాసీంపీర్లు



కోడుమూరు: పీర్లస్వాములను దర్శించుకుంటున్న భక్తులు

కబడ్డీ విజేత నంద్యాల జట్టు

ఓర్వకల్లు: మండలంలోని బ్రాహ్మణపల్లె గ్రామంలో సోమవారం ఏబీఎం చర్చి ప్రతిష్టోత్సవం సందర్భంగా నిర్వహించిన కబడ్డి పోటీలు హోరాహోరీగా సాగాయి. ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచి మొత్తం 22 జట్లు పాల్గొనగా నంద్యాలకు చెందిన మహాబలి జట్టు మొదటి స్థానంలో నిలిచి రూ.10 వేలను దక్కించుకుంది. శకునాల శివన్న జట్టు రెండవ బహుమతి రూ.8 వేలు, బ్రాహ్మణపల్లె నవీన్ జట్టు మూడో బహుమతి రూ.5 వేలు, నాల్గవ స్థానంలో నిలిచిన యంబాయి జట్టు రూ.3 వేలు కైవసం చేసుకున్నాయి. ఆర్గనైజర్లు రాజారావు, మద్దిలేటి, సామ్యుయేల్, వెంకటేశ్వర్లు, ప్రవీణ్, నవీన్, వంశీ, గోపి, సిద్దు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

గూడూరు రూరల్: పట్టణంలో 1905లో స్థాపించిన పాత అంభా భవానీ మాత దేవాలయంలో మంగళవారం ఐజకు చెందిన చిలుకూరు ప్రకాష్, సతీష్, చాణక్య, విజయకుమార్‌శెట్టి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలను నిర్వహించారు. దేవాలయం నుంచి అమ్మవారి ప్రతిమను మునగాల రోడ్డులోని ఆంజనేయస్వామి గుడి వరకు మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకెళ్లారు. మరలా అక్కడి నుంచి అమ్మవారి దేవాలయానికి చేరుకుని పట్టు వస్త్రాలు సమర్పించారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు

కోడుమూరు రూరల్: సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో పట్టణంలో దోమల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. కోడుమూరులో వార్డుల్లో కార్మికులు ఫాగింగ్ చేశారు. ప్రజలు కూడా తమవంతుగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని ఈ సందర్భంగా కోడుమూరు మేజర్ గ్రామ పంచాయతీ ఈఓ అజయ్‌భాస్కర్ సూచించారు. పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు.

వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



పోలీసులతో మాట్లాడుతున్న ఎస్ తిమ్మారెడ్డి

సి.బెళగల్ : మొహరం వేడుకలను మండల ప్రజలు ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సి.బెళగల్ ఎస్‌ఐ తిమ్మరెడ్డి సూచించారు. మంగళవారం ఆయన గ్రామాలలోని పీర్ల చావిడీల దగ్గర ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తును పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ పోలీస్ సిబ్బందికి రక్షణ, నిఘా సూచనలు చేశారు. ఆయా గ్రామాల ప్రజలతో మాట్లాడుతూ సోదరభావంతో మెలగాలని, ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని సూచించారు. వేడుకలలో ఎవరైనా అల్లర్లకు పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేసి జైల్‌కు పంపిస్తామని హెచ్చరించారు.

కోడుమూరు రూరల్ : మతసామరస్యానికి ప్రతీకగా నిలిచే మొహర్రం ఉత్సవాలను ప్రజలు ప్రశాంతంగా జరుపుకోవాలని కోడుమూరు ఎస్‌ఐ బాలనరసింహులు సూచించారు. ఉత్సవాల సందర్భంగా గ్రామాల్లో ఎవ్వరైనా అల్లర్లు సృష్టిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

కుష్టు వ్యాధి సర్వేపై శిక్షణ



గూడూరు పీహెచ్‌సీ వద్ద కుష్టు వ్యాధి లక్షణాల ప్రచార బ్యానర్‌తో వైద్య సిబ్బంది

గూడూరు రూరల్: గూడూరు పీహెచ్‌సీలో మంగళవారం కుష్టు వ్యాధి సర్వేపై ఆశాలు, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ కార్యక్రమాన్ని వైద్యాధికారులు ప్రత్యూష, షఫియా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండల వ్యాప్తంగా ఈ నెల 18 నుంచి వచ్చేనెల 2 వరకు కుష్టువ్యాధిపై సర్వే నిర్వహించేందుకు వైద్యశాఖ చర్యలు తీసుకుందన్నారు. ఈ మేరకు వ్యాధిగ్రస్తులను గుర్తించాల్సి ఉంటుందన్నారు. చర్మంపై స్పర్శ, నొప్పి లేదా దురద లేని మచ్చలు, చెవులు, వీపు, ఎదపై నొప్పిలేని బుడిపెలు, కనురెప్పలు పూర్తిగా మూయలేకపోవడం, చేతులు, కాళ్ల వంకర్లు తిరగడం తదితరాలు ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ వ్యధి ప్రాణాంతకం కాదని, చికిత్స ద్వారా పూర్తిగా రోగిని బాగు చేయవచ్చునన్నారు. ఆ దిశంగా ప్రజలను చైతన్య పరచాలని, ప్రభుత్వ ఆసుపత్రుల్లో మందులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌ఓ రామకృష్ణ, హెచ్‌ఇ కృష్ణారెడ్డి, ఎంపీహెచ్‌ఎస్ రాఘవయ్య, ఆశాలు శ్రీలక్ష్మి, పార్వతమ్మ, శేషమ్మ, తదితరులు పాల్గొన్నారు.